అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 187. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.10.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## లింగమయ్యగా కొలువైన శివుడు

అచ్చంపేట, ఏప్రిల్ 9 :అమృత్ తెలంగాణ: సాహసోపేతమై దక్షిణాది అమర్‌నాథ్ యాత్రగా పేరుగాంచిన సలేశ్వరం జాతరకు వేళైంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దట్టమైన నల్లమల అడవిలోని లింగమయ్య దర్శనానికి సర్వం సిద్ధమైంది.ఈనెల 11 నుంచి 13 వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉగాది పండుగ తర్వాత తొలి చైత్ర పౌర్ణమికి జాతర జరుగుతుంది. ఈ మూడ్రోజులు ఇక్కడ చెంచులే పూజారులుగా అరుదైన ఉత్సవం జరగనున్నది. తెలంగాణ నుంచే గాక ఏపీ, కర్ణాటక,తమిళనాడు నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. వచ్చే భక్తులు వస్తున్నాం..లింగమయ్యా.. అంటూ.. తిరిగి వెళ్లే స మయంలో వెళ్తున్నాం..లింగమయ్యా.. అన్న నినాదాలతో అడవి పులకించనున్నది. ఇక్కడ జలపాతానికి సందర్శకులు, భక్తులు ముగ్ధులు కావాల్సిందే.. ఇక్కడే ఉన్న గుండంలోని నీరు చల్లగా ఉంటుంది. అనేక వనమూలికలతో కలిసిన ఈ నీరు ఆరోగ్యానికి చాలా మంచిందని భక్తులు బాటిళ్లలో నింపుకొని వెళ్తుంటారు.

## జీఓ నెం 21 ని రద్దు చేయాలి..

సుల్తాన్ బజార్ :అమృత్ తెలంగాణ: కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో తరగతులు బహిష్కరించిన విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం కోఠి లోని మహిళా విద్యాలయం (బ్రిటిష్ రెసిడెన్సి) దర్బార్ హాల్ వద్ద ఆందోళనకు దిగారు. కొత్తగా అధ్యాపకుల నియామకాల కోసం ప్రభుత్వం ఇచ్చిన జీఓ 21ను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వ విద్యాలయాలలో పని చేస్తున్న 1270 మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయం కాంటాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ ఉపేందర్ రావు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం జారీ చే సి ఓ నెంబర్ 21 వెంటనే ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ..నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించిన తర్వాతే మాత్రమే కొత్త నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఐకాస నాయకులు కోరారు.

# కేసీఆర్‌ది సాగుభాష.. రేవంత్‌ది సావుభాష

సంగారెడ్డి, ఏప్రిల్ 9 అమృత్ తెలంగాణ: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ది సాగుభాష అయితే, సీఎం రేవంత్‌రెడ్డిది సావు భాష అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం హోదాలో కేసీఆర్ పదేండ్లలో సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, చెక్‌డ్యామ్‌లు, నీటి తీరువా రద్దు గురించి మాట్లాడి తక్షణ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పేగులు మెడలో వేసుకుంటా, సంపుత, తొక్కుత, బట్టలూడదీస్త.. అంటూ సావు భాష మాట్లాడుతున్నారని విమర్శించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త ఆదర్శ్‌రెడ్డి బుధవారం రామచంద్రాపురంలోని తన నివాసం నుంచి పటాన్‌చెరు మండలం గణేశ్‌గడ్డ సిద్ధివినాయక ఆలయం వరకు కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఢిల్లీలో సీఎం రేవంత్ పని అయిపోయిందని, ఆ పార్టీ అగ్రనేతలైన సోనియా, రాహుల్‌గాంధీ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. కనీసం బీసీ ధర్నాకు రాహుల్‌ను రేవంత్ రప్పించలేకపోయారని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాలతో హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులు ఎత్తివేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన చేయటం ఇంకా గమ్మత్తైన విషయమని పేర్కొన్నారు. సీఎం, హోంమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి కేసులు పెడితే భట్టి విక్రమార్క కేసులు ఎత్తివేయడం చూస్తే విడ్డూరంగా ఉన్నదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టారని భట్టి విక్రమార్క హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులు ఎత్తివేయమన్నాడని, తప్పుడు కేసులు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ అసమర్థ పాలనతో తిరోగమనం

కేసీఆర్ నాడు తెలంగాణను నిలబెటితే, నేడు రేవంత్ పడగొట్టిండని హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం కేసీఆర్ తన పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి కాంగ్రెస్‌కు అప్పగించారని, రేవంత్‌రెడ్డి తన అసమర్థ పాలనతో తెలంగాణను తిరోగమనం వైపు నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో జీఎస్టీ గ్రోత్‌రేట్ 12 శాతం ఉంటే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో 5శాతానికి చేరుకుందని విమర్శించారు. ఇలా రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ



అన్ని రంగాల్లో వెనకబడిపోయిందని తెలిపారు. ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనలను కోరుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాల్లో గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్క తుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సంగారెడ్డిజిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన కేసీఆర్

శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూధనాచారి మాట్లాడుతూ కేసీఆర్ తన హయాంలో తెలంగాణను బంగారు తెలంగాణ తీర్చిదిద్దినట్టు చెప్పారు. తెలంగాణలో ఒక్కొక్క సమస్యను పరిష్కరించి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు కేసీఆర్ నడిపించారని తెలిపారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నదని, ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధూ ఆదర్శ్‌రెడ్డి, మెట్టుకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు కేంద్రం 15 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలి : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మహిళలకు స్వావలంభన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, మహిళా సంఘాలకు రూ. 15 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను కేంద్ర ప్రభుత్వం అందించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు రూ. 16.5 లక్షల మేర రుణమాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మహిళలకు ఇవ్వడానికి మాత్రం మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెబుతూ మహిళలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. బుధవారం నాడు తెలంగాణ మహిళా సాధికారత సమాఖ్య సంఘం సభ్యులు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఎప్పుడూ తాము అబద్ధం చెప్పలేదని, మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామనే చెప్పామని, కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ. 20 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తున్నట్లు అబద్దాలు చెబుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ. 5 లక్షల మేర వడ్డీ లేని రుణాలు ఇస్తున్నదని, కానీ అబద్దాలు చెప్పి మహిళలను మభ్యపెట్టే



ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రాలు ఏ చిన్న పని చేసినా కేంద్ర ప్రభుత్వం తమ భాగస్వామ్యం కూడా ఉందని చెప్పుకుంటుందని, ప్రతీ చిన్న పనికి నిధులు ఇచ్చే కేంద్ర ప్రభుత్వం మహిళలకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని నిందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ.15 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసి లూటీ చేసే పెద్ద పెద్ద వ్యాపారవేత్తలకు రూ. 16.5 లక్షల మేర రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని, కానీ మహిళలకు మాత్రం రుణాలు ఇవ్వడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మనసు రాకపోవడం శోచనీయమని అన్నారు. నిజంగా మహిళల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రకటించాలని సూచించారు. మహిళల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాసు ధరను రూ. 50 పెంచి గుదిబండను మోపిందని మండిపడ్డారు. అంతర్జాతీయంగా ధరలు తగ్గుతుంటే ఇక్కడ పెంచడమేంటని నిలదీశారు. ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నిస్తే ప్రధాని మోదీ ఇంత గొప్పోడు అంత గొప్పోడు అని బీజేపీ నాయకులు అంటున్నారని, ఇలా ఇష్టమున్నట్లు ధరలు పెంచితే మోదీ ఎంత గొప్ప వ్యక్తి మాకేంటి అని అన్నారు. ఈ కార్యక్రమలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రూప్ సింగ్ , జాగృతి నాయకులు మర్రిపల్లి మాధవి మరియు పెద్దయెత్తున మహిళలు పాల్గొన్నారు

# భూమ్ రాంగ్..!! హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి.


ఏప్రిల్ 9 అమృత్ తెలంగాణ: హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ రూ. 1090 కోట్లతో స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 299 ఆస్తులను స్థల సేకరణకు గుర్తించి, 112 ఆస్తులకు సంబంధించి మార్కింగ్ చేశారు.

స్థల సేకరణలో అడ్డంకులు తలెత్తడం కొందరు భూ సేకరణకు వ్యతిరేకంగా న్యాయస్థానాలను ఆశ్రయించడంతో భూ సేకరణ ప్రక్రియ సాగలేదు. ప్రాజెక్టు పురోగతిలో ఉందని న్యాయస్థానంలో చెప్పుకొనే ప్రయత్నంలో భూసేకరణపై స్పష్టత లేకుండానే పనులకు సంబంధించి అధికారులు ఇటీవల టెండర్లను సైతం పిలిచారు. ప్రముఖ కంపెనీలు మెగా, కేఎన్ఆర్, ఎంవీఆర్‌లు పాల్గొన్నాయి. టెండర్ కమిటీ అర్హత కలిగిన కంపెనీకి పనులు అప్పగించాల్సిన తరుణంలో టెండర్ ప్రక్రియను పూర్తి చేసే సాహసం చేయడం లేదు.

టెండర్ కమిటీ కాలాయాపన

కేబీఆర్ పార్కు చుట్టూ సినీ, రాజకీయ ప్రముఖులు చాలా మంది ఉన్నారు. వీరిలో ప్రధానంగా అధికార పార్టీ మాజీ మంత్రి జానారెడ్డి, సినీ హీరో బాలకృష్ణ, మరో సినీ హీరో అల్లు అర్జున్ మామ కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి , ఇతర పారిశ్రామిక, వ్యాపారవేత్తలు ఉన్నారు. ఖరీదైన స్థలాలు కావడంతో చాలా మంది స్థలాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఇందులో ఇప్పటికే కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. వాస్తవంగా ప్రాజెక్టు పనులు చేపట్టాలంటే ముందుగా భూ సేకరణ అత్యంత కీలకం. భూ సేకరణపై స్పష్టత వచ్చాకే పనులకు సంబంధించి ప్రక్రియ ప్రారంభించాలి.

కానీ ఇక్కడ భూసేకరణ అడ్డంకులను తొలగించకముందే టెండర్లు పిలిచి .అంతేస్థాయిలో టెండర్ కమిటీ కాలాయాపన చేస్తుండడం ప్రత్యేక చర్చకు దారి తీసింది. పురపాలక డిప్యూటీ సెక్రటరీ, పబ్లిక్ హెల్త్ విభాగం ఈఎన్సీ, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్, జలమండలి డైరెక్టర్, ఫైనాన్స్ విభాగం సీనియర్ అధికారులతో కూడిన కమిటీ సమావేశంలో ఏజెన్సీ ఫైనల్ చేయాల్సి ఉంది. తర్వాత ఫైనాన్షియల్



బిడ్‌ను సైతం తెరిచి ఏజెన్సీ ఖరారు చేయాల్సి ఉంటుంది. కానీ టెక్నికల్ బిడ్లు తెరిచి 12 రోజులు కావొస్తున్న కమిటీ సమావేశం నిర్వహించకపోవడంతో ప్రాజెక్టు పనులు ప్రశ్నార్థకంగా మారింది.

సవాల్‌గా మారిన భూ సేకరణ

దాదాపు రూ. 741 కోట్ల వరకు భూసేకరణకు ఖర్చు అవుతుందని, 56,621.30 చదరపు గజాల విస్తీర్ణం ఉన్నట్లు అంచనా వేశారు. విరించీ దవాఖాన నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్ వరకు 6.50 కి.మీ పొడవు 100 ఫీట్ల నుంచి 120 ఫీట్ల వరకు రోడ్డు విస్తరించాలని నిర్ణయించి.. 81 ఆస్తులను సేకరించాలని భావించారు. కేబీఆర్ పార్కు ఎంట్రన్స్, ముగ్ధ జంక్షన్ పరిధిలో 40, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్ 47, మహారాజా అగ్రసేన్ జంక్షన్‌లో 34, ఫిలింనగర్‌లో 43, రోడ్డు నంబర్ 45లో 36, క్యాన్సర్ ఆసుపత్రి జంక్షన్‌లో 18 ఆస్తులను సేకరించాల్సి ఉంది. న్యాయస్థానంలో కేసులు పడుతుండడంతో ఆస్తుల సేకరణకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేయడం లేదు.

# కలుషిత నీటితో జాగ్రత్త..

ఏప్రిల్ 9 అమృత్ తెలంగాణ: వేసవి కావడంతో ఎండలు దంచికొడుతున్నాయి. అదే సమయంలో చాలా ప్రాంతాలలో తాగునీరు లభించకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్‌లు, ఆర్ఓ ప్లాంట్ మినరల్ వాటర్‌పై ఆధారపడుతున్నారు. అయితే నగరంలో జలమండలి పరిధిలో సరఫరా అయ్యే నీటి నాణ్యతలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. మెజారిటీ ప్రైవేటు ట్యాంకర్‌లు, ఆర్ఓ ప్లాంట్ల ద్వారా సరఫరా చేసే మినరల్ క్యాన్ల ద్వారా సరఫరా చేసే నీటి నాణ్యతపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆ నీటిని తాగే ప్రజలు రోగాలబారిన పడుతున్నట్లు సమాచారం. గత పది రోజులుగా నగరంలోని చాలా చోట్ల డయేరియా కేసులు నమోదవ్వడమే దీనికి ఉదాహరణ. దీంతో ప్రైవేట్ ట్యాంకర్‌లు, మినరల్ వాటర్ క్యాన్‌లపై ఆధారపడి ఉన్న ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొంతమంది ప్రైవేటు ట్యాంకర్‌ల నిర్వాహకులు నీటి నాణ్యతపై ఎలాంటి శ్రద్ధ వహించకుండా ప్రజల డిమాండ్ మేరకు ఎలాంటి శుద్ధి చర్యలు తీసుకోకుండా బోర్ల నుంచి నేరుగా నీటిని నింపి సరఫరా చేస్తున్నారనే విమర్శలున్నాయి. అదే తరహాలో ఆర్ఓ ప్లాంట్లలో మినరల్ వాటర్ క్యాన్‌లు విక్రయించే వారు సైతం నీటి నాణ్యత విషయంలో ఎలాంటి ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. అటు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల




విషయంలోగాని.. ఇటు మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుల విషయంలో గాని సంబంధిత అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

జ్యూస్‌లు, చల్లటి పానీయాలతో

వేసవిలో దాహార్తిని తీర్చుకోవడానికి చాలామంది రోడ్లపై విక్రయించే చల్లటి పానీయాలు, పళ్లరసాలు వంటి వాటిని ఎక్కువగా తాగుతుంటారు. అయితే వీటిని తయారు చేసే క్రమంలో వినియోగించే నీరు కలుషితమైతే డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు వైద్యులు. పరిశుభ్రత లేనిచోట పానీయాలు, జ్యూస్‌లు తాగవద్దని సూచిస్తున్నారు. అలాగే వీధుల వెంట విక్రయించే పానీపూరి పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని పానీపూరిలో వినియోగించే మసాలా నీటి వల్ల డయేరియాకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పరిశుభ్రత, స్వచ్ఛత లేని చోట ఎలాంటి ఆహార పదర్థాలుగాని, పానీయాలు గాని తీసుకోవద్దని సూచిస్తున్నారు.

స్వచ్ఛమైన నీటినే తాగాలి

ప్రజలు తాగునీటి విషయంలో జాగ్రత్తలు వహించాలి. కలుషిత నీటి వల్ల డయేరియా వంటివి వస్తుంటాయి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛమైన నీటినే తాగాలి. బయటి జ్యూస్‌లు, కూల్‌డ్రింక్స్ వంటి వాటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. కొబ్బరి నీళ్లు, తాజా పళ్ల రసాలు, మజ్జిగ వంటివి తీసుకోవడం ఉత్తమం. వాంతులు, విరేచనాలు వంటివి జరిగితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. అలాగే నీటిని కాచి, చల్లార్చి తాగడం ఉత్తమం.

–డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, యాదాద్రి భువనగిరి ప్రభుత్వ దవాఖాన

# చల్లారని మంచు వివాదం

పహాడీషరీఫ్, ఏప్రిల్ 9:అమృత్ తెలంగాణ: సినీ నటుడు మంచు మోహన్ బాబు కుటుంబ తగాదాలు మరోసారి రచ్చకెక్కాయి. అయితే వారి కుటుంబానికి సంబంధించి గత రెండు నెలలగా ఎలాంటి గొడవలు తెరపైకి రాకపోవడంతో మోహన్‌బాబు పెద్ద కొడుకు మంచు విష్ణు తాను హీరోగా నటిస్తున్న కన్నప్ప సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉంటున్నారు. మరో వైపు మనోజ్ కూడా సినిమా షూటింగ్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో గతంలో జరిగిన కుటుంబ తగాదా వ్యవహారులు సద్దుమనిగాయని భావిస్తున్న తరుణంలో తాజాగా గురువారం ఉదయం హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్బాబు ఇంట్లోకి వెళ్లడానికి మంచు మనోజ్ ప్రయత్నించగా.. అక్కడ భద్రత నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ అతన్ని లోనికి రాకుండా అడ్డుకున్నారు. ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో తన అనుమతి లేనిదే ఎవరూ లోపలికి రాకూడదని, ఇది నా ఆర్డర్ అనే హెచ్చరిక బోర్డును మెహన్ బాబు జల్‌పల్లిలోని ఇంటి గేటుకు ఏర్పాటు చేశారు. అయితే తాను లోపలికి వెళ్లేందుకు కోర్టు అనుమతి ఉం దంటూ మనోజ్ చెప్పినా సెక్యూరిటీ సిబ్బంది అతడిని లోపలికి అనుమతించలేదు. దీంతో మనోజ్ గేటు బయటే బైఠాయించి నిరసనకు దిగారు. మనోజ్ భార్య మౌనిక సైతం అక్కడికి వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు మోహన్‌బాబు ఇంటి వద్ద భారీగా బలగాలను మోహరించారు. ఇతరులు అక్కడికి వెళ్లకుండా మోహన్ బాబు ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఆపేస్తున్నారు. మనోజ్ గేటు బయట ఆందోళనకు దిగడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది.

కారు పోయిందంటూ ఫిర్యాదు..

తన కారు పోయిందని మంచు మనోజ్ మంగళవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 1వ తేదీన తన పాప పుట్టిన రోజు వేడుకల నిమిత్తం రాజస్థాన్ వెళ్లగా ఇదే అసరాగా తన సోదరుడు విష్ణు 150మందితో జల్‌పల్లిలోని ఇంట్లోకి ప్రవేశించి తన సామగ్రి ధ్వంసం చేశారని మనోజ్ ఆరోపించారు. తన కార్లలో కొన్నిటిని టోయింగ్‌వాహనంతో లాక్కెళ్లి రోడ్డుమీద వదిలేశారని, మరికొన్నిటిని



దొంగిలించి విష్ణు ఇంట్లో పార్క్ చేశారన్నారు. అలాగే తన సెక్యూరిటీ సిబ్బందిపై కూడా దాడి చేశారని పేర్కొన్నారు.

అనుమతి ఉన్నా రానివ్వడం లేదు.

మోహన్ బాబు ఇంటి ఎదుట బైఠాయిం చిన మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఆస్తిలో చిల్లిగవ్వ వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పానన్నారు. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతుంటే ఇప్పటివరకు పోలీసులు ఒక్క చార్జిషీట్ ఫైల్ చేయలేదని, కొంతమంది ప్రవేట్ వ్యక్తులు కత్తులు, కర్రలతో మాపైకి వచ్చినా అన్ని ఆధారాలు ఇచ్చినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మనోజ్ ఆరోపించారు. తనకు జల్‌పల్లిలోని ఇంట్లో ఉండేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని, అయితే వాళ్లు అనుమతి లేదని ఇంట్లోకి రానివ్వడం లేదని మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు

హైదరాబాద :అమృత్ తెలంగాణ: డిజె సౌండ్ పెట్టినందుకు, మతపరమైన వ్యాఖ్యలు చేసినందుకు హైదరాబాద్‌లోని గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం శ్రీరామనవమి శోభయాత్రలో భాగంగా ఆకాష్‌పూరి హనుమాన్ టెంపుల్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ఈ శోభాయాత్రలో డిజె సౌండ్ పెట్టడంతోపాటు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, శోభాయాత్ర ఆర్గనైజర్ రాజాసింగ్ ప్రసంగిస్తూ మతపరమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. జాలి హనుమాన్ దేవాలయం సమీపంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య



తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పోలీసులు లాఠీఛార్జి చేస్తే తిరిగి తాము కూడా లాఠీఛార్జి చేస్తామని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. దాంతో ఎమ్మెల్యేతోపాటు మరో ఇద్దరు ఆర్గనైజర్లు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షులు భగవంతారావు, శ్రీరామనవమి పల్లకి సేవా శోభాయాత్ర నిర్వాహకుడు ఆనంద్ సింగ్ లోథ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

## పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి




నిర్మల్ జిల్లా కుంటాల ఏప్రిల్ 9 అమృత్ తెలంగాణ కుంటాల మండలంలోని అంబుగాం గ్రామానికి చెందిన సుదర్శన్ పటేల్ మాతృమూర్తి గత వారం రోజుల క్రితం మృతి చెందడంతో బుధవారం రోజు ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు ఈ సందర్భంగా మరణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు ధైర్యం చెప్పారు ఆయన వెంట ఈ కార్యక్రమంలో దిగంబర్ పటేల్ దత్తురాం పటేల్ మాజీ సర్పంచ్ బాపురావు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆర్మీలో సేవలు అందించడం అభినందనీయం

## ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



అమృత్ తెలంగాణ దేశం రక్షణ కోసం ఆర్మీలో 19 సంవత్సరాల పాటు పని చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. బుధవారం దేగాం గ్రామానికి చెందిన సిందే సందీప్ పటేల్ ఆర్మీలో 19 సంవత్సరాల పాటు పని చేసి రిటైర్డ్ అయినా సందర్భంగా శాలువా తో సత్కరించి, అభినందించారు.. కార్యక్రమం లో భైంసా మండల బిజెపి అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, నాయకులు లింగన్న,కిషన్ పటేల్,ప్రకాష్, తదితరులు ఉన్నారు.

## పోషన్ పఖ్వాడా (పోషణ పక్షం) పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ చిన్నారులు, గర్భిణిలలో రక్త హీనత ను నియంత్రించేందుకు పోషకాహారంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి పోషన్ పఖ్వాడా (పోషణ పక్షం) కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 8 నుంచి 22 వరకు జిల్లాలో పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహార లోపంపై విస్తృత అవగాహనా కలిగేలా ప్రతి అంగన్వాడి కేంద్రాలలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నాగమణి, ఏసిడిపిఓ నాగలక్ష్మి, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఎం.సి.ఎచ్ వైద్యులు సరోజ, జిల్లా సమన్వయకర్త నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూవివాదం.. ఇరువర్గాల ఘర్షణ

తుర్కయాంజాల్, ఏప్రిల్ 9 :అమృత్ తెలంగాణ: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ సర్వే నంబర్ 240లో భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కమ్మగూడ సర్వే నంబర్ 240, 241, 242లోని సుమారు 10 ఎకరాల భూమి తమకు చెందినదని ఈ మే రకు కోర్టు అర్డర్ ఉందంటూ పలువురు వ్యక్తులు బుధవారం స్థలాన్ని కబ్జాలోకి తీసుకునేందుకు యత్నించారు. అందులో భాగంగా ప్లాట్ల క డీలు, ప్రీకాస్ట్ గోడలను కూల్చివేస్తున్న సమయంలో కాలనీలో నివాసం ఉంటున్న వారితో పాటు ప్లాట్ల యజమానులు వాటిని కూల్చవద్దంటూ అడ్డుకున్నారు ఈ క్రమంలో కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులు ప్లాట్ల యజమానులు, కాలనీ వాసులపై దాడికి పాల్పడడంతో వారు తిరిగి రాళ్లతో దాడికి దిగి కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులను తరిమికొట్టారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న సందర్భంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు అంటించడంతో పూర్తిగా కాలిపోయింది. అనంతరం కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులు పలువురు మహిళలను ఘ టనా స్థలానికి తీసుకు రాగా కాలనీవాసులు వారిని అడ్డుకొని వారు వచ్చిన బస్సును కొంతమేర ధ్వంసం చేశారు. వివాదం చోటు చేసుకున్న గంటన్నర తర్వాత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు.

# మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి తొట్టెల ఏర్పాటు

### వానరులు (కోతులు), వన్య ప్రాణులు,పక్షుల కోసం దట్టమైన అడవిలో ఏర్పాటు. వాటికి ఆహారం ఏర్పాటు చేసిన ఛైర్మన్ యం ఆంజనేయులు..







అడవి జంతువుల కొరకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు

నిర్మల్ జిల్లా అమృత్ తెలంగాణ ఎత్తైన గుట్టలు..దట్టమైన అడవులు..తాగడానికి నీళ్లు లేక, ఆహారం లేక చనిపోతున్న వణ్య ప్రాణులు ముఖ్యంగా (వానరజాతి) కోతులు.. పక్షులు.... వన్యప్రాణుల ఆకలి దప్పికలు తీర్చాలనే తపనతో దాదాపు 75 కిలోమీటర్లు ప్రయాణించి దాదాపు 13(ఒక్కో నీటి తొట్టెలో 200 లీటర్ల నీరు పడుతుంది) పెద్దవైన నీటి తొట్టెలను దాతలు శ్రీ .ముత్యం రెడ్డి గారు (అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అదిలాబాద్ జిల్లా) 10 కుండీలను శ్రీ డాక్టర్ దేవేందర్ రెడ్డి గారు (దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మల్) గారు 2 కుండీలు ,శ్రీమతి దివ్య అజయ్ రావు గారు 1 కుండీల సహకారంతో తయారు చేయించి ఈరోజు నిర్మల్ జిల్లా ఎత్తైన గుట్టల ప్రాంతాల్లో మరియు ఆదిలాబాద్ జిల్లా వాంకిడి దట్టమైన అడవి ప్రాంతంలో రోడ్డు పక్కన వివిధ ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేసి అందులో నీటిని నింపడం జరిగింది. అదేవిధంగా కోతుల ఆకలి తీర్చుటకు దాదాపు 5 క్వింటల్లా ఖర్బుజ పండ్లను వాటికి వేయడం జరిగింది... మా ప్రత్యేక విజ్ఞప్తి అటుగా నిరంతరం ప్రయాణించే ప్రయాణికులు అటువైపుగా వెళ్లేవారు వారి వెంట కనీసం ఒక రెండు లీటర్ల గాని ఐదు లీటర్ల నీటిని అట్టి తొట్టెలలో పోసినచో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మా ప్రత్యేక విజ్ఞప్తి. జిల్లా కలెక్టర్ గారికి మా ప్రత్యేక విన్నపం తీవ్రమైన ఎండలు ఉండడంతో ఎత్తైన గుట్టల ప్రాంతాలలో వన్యప్రాముల కొరకు కోతుల కొరకు పక్షుల కొరకు మేము ఏర్పాటు చేసిన నీటి తొట్టెలలో రోజు ఒక ట్యాంకర్ ద్వారా నీటిని పోయిస్తారని మా ప్రత్యేక ప్రార్థనలు. ఈ కార్యక్రమంలో వంశీ సాయిలు, నరేష్ సాయన్న దేవన్న,సాయి తదితరులు పాల్గొన్నారు

# దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశాన్ని జయప్రదం చేయండి.


### కుంటోల్ల వెంకటస్వామి తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు.

నిర్మల్ ఏప్రిల్ 9 ( అమృత్ తెలంగానా) నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో గురువారం రోజున సాయంత్రం 05 గంటలకు నిర్మల్ జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం నిర్వహించబడును. ఈ సమావేశంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, ప్రపంచ మేధావి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బోధిసత్వ పరమ పూజ్య డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాల నిర్వహణ గురించి తమ తమ సలహాలు సూచనలు అభిప్రాయాలు తెలుపడానికి సమావేశము నిర్వహించబడును కావున జిల్లాలోని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కార్యవర్గ సభ్యులు సర్వ సభ్యులందరూ హాజరై ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుచున్నాము. బుధవారం రోజు ఉదయము 11 గంటలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో దళిత సంఘాల నాయకులతో సమావేశము నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ జయంతి జరగబోయే అంశాలపై సలహాలు సూచనలు అభిప్రాయాలు తెలుపుతూ చర్చించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు ముడుసు సత్యనారాయణ, కుంటోల్ల వెంకటస్వామి వెలుమల ప్రభాకర్ లు మాట్లాడుతూ తేదీ. 10.04.2025 గురువారం రోజు సాయంత్రం ఐదు గంటలకు టీఎన్జీవో భవన్లో జరగబోయే దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఏ రాజేశ్వర్ గౌడ్ సభాధ్యక్షత వహించారు ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, సోషల్ వెల్ఫేర్ సహాయ అధికారి దేవుళ్ళ లత, సూపరింటెండెంట్ జె శ్రీదేవి, మున్సిపాలిటీ డి ఈ , దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ముడుసు సత్యనారాయణ, కుంటోల్ల వెంకటస్వామి, వెలుమల ప్రభాకర్, దౌడ రాములు, ఈరోల పురుషోత్తం, నింగులపు లింగన్న, ఆడ్డిగ లక్ష్మణ్, కత్తి మహేష్, గంగాధర్, అనంతరావు దుర్గే, తదితరులు పాల్గొన్నారు.



సాంఘిక సంక్షేమ జిల్లా అధికారులతో దళిత సంఘ నాయకుల సమావేశం

## గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.





జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పీహెచ్ సి లలో వసతులు, మరమ్మత్తులు, ఇతర సామాగ్రికి సంబంధించిన వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పి ఎచ్ సి లో పరిశుభ్రత ఉండాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న సదుపాయాలను సమీక్షించి, అవసరమైన మరమ్మతులు చేయాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి సంభందిత సౌకర్యాలు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. లైటింగ్, త్రాగునీరు, పెయింటింగ్, ఫ్యాన్లు, వర్షాకాలంలో రూఫ్ లీకేజీ, మరమ్మత్తులు, మరుగుదొడ్లు, తదితర అవసరమగు సదుపాయాల వివరాలను లిఖితపూర్వకంగా అందజేయాలన్నారు. వైద్య చికిత్సల సమయంలో రోగులను అసౌకర్యానికి గురికాకుండా తక్షణం అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పిహెచ్ సి ల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు విశ్రాంత ఉద్యోగులు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో రాజేందర్, ఈఈ పీఆర్ శంకరయ్య, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్, వైద్య శాఖల అధికారులు, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రతినిధులు ఎం.సి లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

## బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



విద్య అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బాలశక్తి కార్యక్రమం అమలు తీరుపై విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులతో ఆమె జూమ్ కాల్ మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలశక్తి కార్యక్రమాన్నీ పక్కాగా అమలు చేయాలనీ ఆదేశించారు. విద్యార్థులందరికీ దశలవారీగా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర ఆరోగ్య కార్డులను తయారు చేయాలని సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతుల వివరాలు, అవసరమైన ప్రత్యేక పోషక ఆహారం, మందులను వారి పోషకులకు అందజేయాలని ఆదేశించారు. విద్య, వైద్యం, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా క్విజ్ పోటీలను నిర్వహించాలన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులకు జీవితంలో ఉపయోగపడే పలు కోర్సులను నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలని, ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, విద్యశాఖ అధికారులు సలోమి కరుణ, లింబాద్రి, పాల్గొన్నారు.

# "మెసేజ్ యువర్ ఎస్పి" కార్యక్రమం ప్రారంభం .

### ఎలాంటి సమస్యలు ఉన్న, సమాచారం అందించాలన్న వాట్సప్ ద్వారా సంప్రదించండి. సంప్రదించవలసిన వాట్సప్ నెంబర్ 8712659973

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలైనా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలైనా సమాచారం అందించవచ్చు, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. నేరుగా ఫిర్యాదు చేయలేనివారు, సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు వాట్సప్ మెసేజ్ రూపంలో ఫిర్యాదు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్. సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ ఫోన్ వినియోగం యువత చేతుల్లోకి మరింత అందుబాటులోకి రావడం వల్ల, జిల్లా అధికారులను సులువుగా సంప్రదించాలని వినుత్త ఆలోచనతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ప్రజలకు మరింత చేరువ కావాలని ఉద్దేశంతో మెసేజ్ యువర్ ఎస్పి పేరుతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుంది. శాంతి భద్రతల పరిరక్షణ నే ధ్యేయంగా, జిల్లా ప్రజలకు మరింత వేగవంతమైన పారదర్శకమైన సేవలను అందించాలని ఈ మెసేజ్ యువర్ ఎస్పి కార్యక్రమం. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు, సుదూర ప్రాంతాలలో ఉన్న ప్రజలు, ఎలాంటి సమస్యలున్న, ఎలాంటి సమాచారాన్ని అందించాలన్న జిల్లా ఎస్పీ గారికి నేరుగా సమాచారాన్ని అందించవచ్చు. సమాచారాన్ని అందించవలసిన పద్ధతి మీ ఇరు మీ వాట్సాప్ ద్వారా జిల్లా పోలీసు వాట్సప్ నంబర్ 8712659973 కు సంప్రదించాలని తెలియజేశారు. సమస్యలపై పూర్తి వివరాలను రాసి వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. లేదా జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన సంఘవిద్రోహ కార్యకలాపాలు నిర్వహించిన సమాచారం మీకు అందించాలనిపిస్తే ఈ నెంబర్ కి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. వేగవంతమైన పరిష్కారాల కోసం ఈ వాట్సాప్ సేవలు తన పర్యవేక్షణలోనే ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.




## తుర్కయాంజల్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ..

తుర్కయాంజల్ :అమృత్ తెలంగాణ: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ సర్వే నెంబర్ 240లో ఇరువర్గాలకు మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. స్థలాన్ని కబ్జాకు యత్నిస్తుండగా.. అడ్డుకోవడంతో ఇరువర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే..సర్వే నెంబర్ 240, 241, 242లో సుమారు పదెకరాల స్థలం తమదేనని.. తమకు కోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయంటూ పలువురు ప్లాట్ల కడీలు, ఫ్రీ కాస్ట్ గోడలను బుధవారం తెల్లవారు జామున కూల్చివేసేందుకు యత్నించారు. కాలనీవాసులు, ప్లాట్ల యజమానులు కబ్జాకు యత్నిస్తున్న వారిని అడ్డుకున్నారు. దాంతో సదరు వ్యక్తులు కాలనీవాసులపైకి దాడికి దిగారు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు.

# పేకాట స్థావరం పై దాడి - ఆదిలాబాద్ ఒకటో పట్టణ సిఐ బి సునీల్ కుమార్.

ఏడుగురు అరెస్ట్, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.

రూ 2620 నగదు, ఒక బైక్, 9 మొబైల్ ఫోన్లు, పేకాట ముక్కలు స్వాధీనం.




సునీల్ కుమార్ సీఐ

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతినగర్ నందు సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ కు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా పేకాట ఆడుతూ ఏడుగురు వ్యక్తులు పట్టబడ్డారని ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు. వీరి వద్దనుండి రూ 2620 నగదు మరియు ఒక బైక్, 9 మొబైల్ ఫోన్లు, పేకాటముక్కలు స్వాధీనం చేసుకొని ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం తెలిపారు.

వారి వివరాలు

1) సయ్యద్ అఫ్సర్ s/o సయ్యద్ భాష.
2) షేక్ షకీల్ s/o సాబీర్.
3) రహీం ఖాన్ .
4) ఎండి వాజిద్ అహ్మద్ s/o నజీర్ అహ్మద్.
5) షేక్ వసీం s/o ఇక్బాల్.
6) సలాం బిన్ ముబారక్ s/o ముబారక్
7) షేక్ శభాజ్ s/o బాబు.

# ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో రాంజీ గోండు 168 వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన. గోడం నగేష్ ఎంపీ ఆదిలాబాద్



నివాళులు అర్పిస్తున్న ఆదిలాబాద్ ఎంపీ జి నగేష్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : గిరిజన మొదటి తరం స్వాతంత్ర సమరయోధుడు మర్సుకోళ్ల రాంజీ గొండ 1857 బ్రిటిష్ ప్రభుత్వం తిరుగుబాటు చేసిన ఉద్యమకారుడు అన్నీ వర్గాల ప్రజలను ఏకంగా చేసి బ్రిటిష్ ప్రభుత్వం మరియు నిజం ప్రభుత్వం తిరుగుబాటు చేసిన నాయకులు అమరవీరుల మర్సుకోళ్ల రాంజీ గోండ్ అమరత్వాన్ని నేడు బీజేపీ ప్రభుత్వం గుర్తించి వారి చరిత్ర భావితరాలకు అందించాలి అనే దృకపదం తో వారి పేరిట 25 కోట్ల తో హైదరాబాద్ లో మ్యూజియం నిర్మిస్తున్నది భారత దేశం లో( జూగా ) యోజన ద్వారా గిరిజనులకు అభివృద్ధి చేయాలనే తపన తో గౌ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ముందు వుంటారు అనీ ఆదిలాబాద్ ఎంపీ అన్నారు ఈ కార్యక్రమం లో కనపర్తి చంద్రకాంత్ బోసలే దసరాత్ పాటిల్ శేఖర్ బీజేపీ నాయకులు పెందుర్ తుల్సరాం మెస్రం భూమన్న వాగమరే సైలెందర్ రాజన్న గిట్టే సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనేనా..!



కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 7:అమృత్ తెలంగాణ: జిల్లాలో మరో వారంలో యాసంగి కోతలు ప్రారంభం కానుండగా, యంత్రాంగం కొనుగోళ్ల ఊసెత్తడం లేదు. ఇప్పటికే ఏర్పాటు పూర్తి చేయాల్సి ఉండగా, ఎలాంటి కార్యాచరణ రూపొందించకపోవడం.. మద్దతు ధర ప్రకటించకపోవంపై అన్నదాతల్లో ఆందోళన కనిపిస్తున్నది. అసలు సర్కారు సేకరణ చేపట్టేనా.. అన్న సందేహం వ్యక్తమవుతున్నది.

కొనుగోలు కేంద్రాలేవీ..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో యాసంగిలో 22 వేల ఎకరాల్లో వరి సాగు కాగా, సుమారు 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా బోర్లపై ఆధారపడి పంటలు వేయగా, ఈసారి కరెంటు కోతల వల్ల దిగుబడి తగ్గే అవకాశమున్నది. మరో వారంలో కోతలు ప్రారంభించే అవకాశముంది. అయితే ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించగా, ఈసారి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే రైతులు మిల్లర్లు, దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి.

మద్దతు ధరపై నిర్ణయమెప్పుడో..

గత వానకాలంలో పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సన్నబియ్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు వేసిందో అధికారులకే తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ యాసంగిలో ధాన్యా న్ని ప్రభు త్వం కొనుగోలు చేస్తుందా.. లేదా అన్న సందే హం రైతుల్లో కనిపిస్తున్నది. గత వానకాలంలో వరికి క్వింటాలుకు రూ. 2350 మద్దతు ధర కల్పించగా, ఈసారి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

# షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన దుకాణాలను ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తా



కుంటాల : అమృత్ తెలంగాణ: నిర్మల్ జిల్లా కుంటాల మండలం ఓలా గ్రామంలోని విశ్వ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రాజశేఖర్, రంజిత్, రాకేష్ ల వడ్రంగి వర్క్ షాపులు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఆ దుకాణంలో ఉన్న పనిముట్లు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్థుల ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావ్ పటేల్ బుధవారం ఓలా గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాలిపోయిన దుకాణాలను పరిశీలించారు. బాధలో ఉన్న కుటుంబీకులను ఓదార్చారు. ధైర్యం కోల్పోవద్దని కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. దగ్ధమైన మూడు దుకాణాలను మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజుల్లో నిర్మించి ఇస్తానని మోహన్ రావ్ పటేల్ హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు లక్ష్మణ్ పటేల్, గుద్దేటి నర్సయ్య, ముధోల్ మాజీ ఎంపీపీ సుబాష్ పటేల్, రవి, రఘువీర్, ట్రస్ట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# ఐకేపీలో దొంగలు పడ్డారు



కేతేపల్లి, ఏప్రిల్ 9 :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యానికి రక్షణ లేకుండా పోయింది. కేతేపల్లి మండలం బొప్పారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో మంగళవారం రాత్రి ధాన్యం చోరీ జరిగింది. ఇక్కడ వారం రోజుల కిందట కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఊరి పక్కన గల చెరువు దగ్గరున్న ఖాళీ స్థలంలో రైతులు వడ్లు పోశారు. ఆ స్థలం పూర్తిగా నిండిపోవడంతో కాసనగోడు గ్రామం కొనుగోలు కేంద్రం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కొందరు రైతులు ధాన్యం పోసుకున్నారు. రెండు రోజుల నుంచి రాత్రిళ్లు గుర్తుతెలియని దండగులు ఇక్కడి నుంచి రైతుల ధాన్యం దోచుకుపోతున్నారు. సోమవారం రాత్రి ఎంగలి గోపి, పొడిచేటి సోములు అనే రైతుల ధాన్యం రాసుల్లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి పొడిచేటి సోములు, పొడిచేటి శంకర్, చౌగోని శ్రీరాములు అనే రైతుల ధాన్యం సుమారు 20 క్వింటాళ్ల వరకు దుండగులు ఎత్తుకుపోయినట్లు బాధిత రైతులు వాపోయారు. దీనిపై కొనుగోలు కేంద్రం నిర్వాహకులను నిలదీస్తే ఎవరి ధాన్యానికి వారే రక్షణగా ఉండాలని, తామేమీ చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, రాత్రిళ్లు కాపలాదారులను నియమించకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని రైతులు మండిపడుతున్నారు. ధాన్యం చోరీకి గురవడంపై బుధవారం కేతేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# నాడు పురోగమనం.. నేడు తిరోగమనం



రామారెడ్డి (సదాశివనగర్), ఏప్రిల్ 9 అమృత్ తెలంగాణ:: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ వెనుకబడిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని నడిపించలేని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ పురోగమనంలో ఉంటే, రేవంత్ హయాంలో రాష్ట్రం తిరోగమన బాట పట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో బుధవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ ముఖ్యనేతలతో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ నెల 27న నిర్వహించనున్న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సభకు కామారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ తలసరి ఆదాయ వృద్ధి రేటు దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదని, కాంగ్రెస్ పాలనలో ఇప్పుడది 11వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో మూడో స్థానంలో ఉంటే, ఇప్పుడది 14వ స్థానానికి దిగజారిందన్నారు. వరినాట్లు వేసే సమయంలోనే కేసీఆర్ రైతుబంధు వేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు ఉన్నప్పుడే రైతుబంధు వేస్తున్నదని విమర్శించారు. తెలంగాణను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు గూబ గుయ్యిమనేలా వరంగల్ సభతో సమాధానమిస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌కు రాజకీయం ఒక టాస్క్ అని, మిగతా పార్టీలకు వ్యాపారమని అన్నారు.

# గ్యాస్ ధర పెంపుపై ఫైర్



బెల్లంపల్లి, ఏప్రిల్ 9 :అమృత్ తెలంగాణ: కేంద్రప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీపీఐ నాయకులు భగ్గుమన్నారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బెల్లంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి మాట్లాడుతూ కేంద్రం వంట గ్యాస్ సిలిండర్‌పై అదనంగా రూ.50 పెంచడం దారుణమన్నారు. కార్పొరేట్ కంపెనీలు, బడా పారిశ్రామికవేత్తలకు రూ. లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ పేదలపై పెనుభారం మోపుతుందని మండిపడ్డారు. ఆందోళనతో మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు కొంకుల రాజేశ్, గుండా చంద్రమాణిక్యం, గుండా సరోజ, కొండు బానేశ్, బొల్లం సోనీ, రత్నం రాజం, బొల్లం తిలక్ అంబేద్కర్, ఉప్పులేటి శంకర్, గోలేటి రాయలింగు, బండారి శంకర్, కెమెరా దుర్గయ్య, రాధాకృష్ణ, కుందేళ్ల శంకర్, అందుగుల రాజేందర్, అంబాల ప్రభుదాస్, తిప్పారపు శంకరయ్య పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో ఖాళీ సిలిండర్లతో నిరసన..

గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేదర్ చౌరస్తాలో సీపీఎం నాయకులతో కలిసి ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు.

ఆయన మాట్లాడుతూ ఓ వైపు అంతర్జాతీయ మారెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతుంటే.. మన దేశంలో మాత్రం ధరలు పెరగడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు కార్తీక్, మాల శ్రీ, టీకానంద్, శ్రావణి ఉన్నారు.

# పెన్షన్ డబ్బు నుంచి బీఆర్ఎస్‌కు విరాళం సభ కోసం అందజేసిన వృద్ధురాలు



కురవి, ఏప్రిల్ 9 :అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణకు ఓ గిరిజన వృద్ధురాలు విరాళం అందజేసింది. తన వృద్ధాప్యంలో మాజీ సీఎం కేసీఆర్ ఆసరాగా నిలిచారని, సభ ఖర్చులకు తన పెన్షన్ డబ్బు రూ. వెయ్యిని అందజేసి పెద్ద మనసు చాటుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా కురవిలో చోటుచేసుకున్నది. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత బుధవారం మండల కేంద్రంలో రజతోత్సవ సన్నాహక సభ నిర్వహించారు. తుల్యా తండాపరిధిలోని కీమ్యాతండాకు చెందిన బోడ బాజీ రెండు ఐదువందల నోట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలి చేతిలో పెట్టింది. 'భేటీ..మారి పింఛను దీ హాజరు ఆయే దేయాంతి హజార్ రూపియా మార్ మోటే భేటా కేసీఆర్‌దే'(బిడ్డా.. నాకు రూ. రెండు వేల పింఛన్ వచ్చింది. రూ.వెయ్యి నా పెద్ద కొడుకు కేసీఆర్‌కు ఇస్తున్న) అని చెప్పింది.

# సదర్మాట్ సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు.. రహదారిపై రాస్తారోకో



కడెం :అమృత్ తెలంగాణ: సదర్మాట్ ఆయకట్టు కింది రైతులకు సాగునీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తు ఆయకట్టు కింది రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని లింగాపూర్, మల్లన్నపేట, ఎలగడప, దిల్దార్‌నగర్, మాసాయిపేట, నచ్చన్ఎల్లాపూర్, పెత్తార్పు, మద్దిపడగ, లక్ష్మీసాగర్, సారంగపూర్ గ్రామాలకు చెందిన దాదాపు 300కు పైగా మంది రైతులు రాస్తారోకో నిర్వహించారు రైతులు మాట్లాడుతూ జనవరి 2న అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో సమావేశం నిర్వహించి, రైతులకు పంట చివరి వరకు సాగునీటిని అందిస్తామని, నిరభ్యతంరంగా పంటలు సాగు చేసుకోవాలని హామీ ఇవ్వడంతో ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి పంటలు సాగు చేశామని అన్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు వేశాక, వారబంధి పద్ధతిన నీటిని అందిస్తామని అధికారులు వారబంధి పద్ధతిని అమలు చేశారు. వారబంధి పద్ధతిలోనైన పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న తమకు మీకు ఇచ్చిన గడువు ముగిసిందని, ఏప్రిల్ 9న కాలువను మూసివేస్తామన్న అధికారులు పది రోజుల ముందుగానే కాలువను మూసివేశారని వాపోయారు. పంటలు చివరి దశలో ఉండగా, నీటి విడుదలను నిలిపివేస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నించారు. వరిసాగుకు ఇంకా దాదాపు మూడు నుంచి నాలుగు తడులు కావాల్సి ఉంటుందని, ఈ సమయంలో నీటి విడుదల నిలిపివేస్తే రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని అన్నారు. మే 10వ తేదీ వరకు నీటిని అందించాలని, లేని పక్షంలో అందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. పరిస్థితి తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులను విరమించే ప్రయత్నం చేశారు. తహసీల్దార్, కలెక్టర్ ఇక్కడికి వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఊరుకునేది లేదని భీష్మించారు. కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న తహసీల్దార్ రైతులతో మాట్లాడి, సదర్మాట్ అయకట్టు అధికారులతో మాట్లాడారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బొజ్జుపటేల్ వారితో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని, ధర్నాలు, రాస్తారోకోలు చేయడం సరికాదని అనడంతో మీరు అందుబాటులో ఉండడం లేదని, నియోజకవర్గ కేంద్రం ఖానాపూర్ అయినప్పటికీ ఉట్నూర్‌కే పరిమితం అయ్యారని ఆరోపించారు. అధికారులతో మాట్లాడి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఫోన్ కట్ చేయడంతో కలెక్టర్ వచ్చే వరకు రాస్తారోకో చేస్తామని బైటాయించారు. చివరకు అధికారుల హామీతో రాస్తారోకో విరమించారు.

# అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు వ్యాలీ లోఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలచిన జాస్తి





అమరావతి అమృత్ తెలంగాణ: ఉప ముఖ్యమంత్రివర్యులు పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ పవన్ కళ్యాణ్ కు సన్మానం ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ ల సంక్షేమ సంఘం అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ / డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ని సన్మానించిన సర్పంచ్ లుఅడవి తల్లి బాట పేరుతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం అరకు వ్యాలీ కి విచ్చేసిన సందర్భంగా అక్కడ రైల్వే గెస్ట్ హౌస్ లో ఉప ముఖ్యమంత్రి వర్యులు పంచాయతీరాజ్ శాఖ పవన్ కళ్యాణ్ ని సన్మానించారు జిల్లాలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన మరియు ఉడెన్ బ్రిడ్జి శంకుస్థాపన మరియు సర్పంచుల సమస్యల పైన మంత్రివర్గంలో చర్చించి పరిష్కరించే దానికి కృషి చేస్తానన్నారు ఈ సందర్భంగా నిన్న మంగళవారం అరకు వ్యాలీలో గిరిజన గ్రామాల సర్పంచులతో కలిసి సన్మానించినారు తరువాత ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ సర్పంచులతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారులి ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్ కృష్ణ తేజ మైలవరపు, ఉపముఖ్యమంత్రి వర్యులు ఓ ఎస్ డి వెంకటకృష్ణ, పిఎస్ మధుసూదన్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయితీ పరిషత్ (దిల్లీ )జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అనంతగిర జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు, అల్లా బక్షు, ఆంద్రాజు శ్రీనివాసరావు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు గసభ సర్పంచ్ పాంగి సునీత సురేష్,పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుస్మిత, పెదలవుడు సర్పంచ్ పెట్టెలిదాసుబాబు, కొర్రాయి సర్పంచ్ పూజారి కొమ్ముల, బొండం సర్పంచ్, దురియ భాస్కరరావు, టోకూరు సర్పంచ్కిల్లోమోషేయ్య,అనంతగిరి సర్పంచ్ సోమేలి రూతు,మఠం సర్పంచ్ మఠం శాంతకుమారి, ఉక్కుంపేట సర్పంచ్ సమీడ పూర్ణిమ, బస్కి సర్పంచ్ పాడి రమేష్,దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టిఎస్ఒ పోటీ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



భీమడోలు :అమృత్ తెలంగాణ: జాతీయ స్థాయిలో నిర్వహించిన సెకండ్ లెవెల్ ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్టిఎస్ఒ) పోటీ పరీక్షల్లో పాల్గొన్న భీమడోలు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పలు అంశాలలో విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ డి.సోహిని తెలిపారు. ఈ తరహా పోటీలలో పాల్గొన్న విద్యార్థుల్లో 140 మంది వివిధ అంశాలలో విజేతలుగా నిలిచారన్నారు. దీనిలో భాగంగా వీరిలో పలువురు గోల్డ్ మెడల్‌తోపాటు పలు కన్సొలేషన్ బహుమతులను సాధించారని చెప్పారు. పరీక్షలకు పాల్గొన్న వారిలో 14 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, 78 మంది కన్సొలేషన్ బహుమతులను దక్కించుకున్నారన్నారు. పాఠశాల నుంచి ఎక్కువమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉత్తీర్ణులు కావడం వెనుక పాఠశాలలో అమలు చేస్తున్న కరిక్యులమ్ అంశం కారణంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన భార్గవ కిరణ్, ముఖేష్ బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మిర్చి ధర మళ్లీ నేలచూపు



గుంటూరు అమృత్ తెలంగాణ: స్వల్పంగా పెరిగిన మిర్చి ధరలు మళ్లీ నేల చూపులు చూస్తున్నాయి. మరోవైపు మంగళవారం మిర్చి యార్డుకు భారీగా సరుకు వచ్చింది. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి 1,44,443 మిర్చి టిక్కీలు రాగా పాత నిల్వలతో కలిపి 1,41,802 టిక్కీలు అమ్ముడుపోయాయి. యార్డులో ఇంకా 66,917 టిక్కీలు నిల్వ ఉన్నాయి. మేలు రకం తేజ, బాడిగ, ఆర్మూరు రకాల ధరలు మరింత తగ్గాయి. గత వారం కనీస ధర క్వింటాళ్ రూ. 11 వేలు, గరిష్ట ధర రూ. 14 నుంచి రూ. 15 వేల వరకు పలికాయి. అయితే మంగళవారం తిరిగి ధరలు తగ్గాయి. తేజ రకం క్వింటాళ్ కనిష్టంగా రూ. 10,200, గరిష్టంగా రూ. 13,500 మాత్రమే పలకడం గమనార్హం. బాడిగ 355 రకం కనిష్ట ధర రూ. 10 వేలు, గరిష్ట ధర రూ. 13,200 మాత్రమే వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత డిమాండ్ కలిగిన ఆర్మూర్ రకం మిర్చికి గరిష్ట ధర రూ. 11 వేలు మాత్రమే వచ్చింది. సాధారణ రకాల ధరలు కూడా భారీగా తగ్గాయి. 334 రకం కనిష్టంగా రూ. 9,500, గరిష్టంగా రూ. 13 వేలు ధర లభించింది. మిగతా అన్ని రకాలు కూడా కనిష్టంగా రూ. 10 వేలు, గరిష్టంగా రూ. 13,300 వరకు లభించాయి. 4884 రకం గరిష్ట ధర రూ. 11,800 వచ్చింది. ధరలు తగ్గడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. గతేడాది క్వింటాళ్ రూ. 20 వేలు పలికిన దేవనూరు డీలక్స్ రకం ఈ ఏడాది రూ. 13 వేలు మించడం లేదు. మంగళవారం కనిష్ట ధర రూ. 10,300, గరిష్ట ధర రూ. 12,600 మాత్రమే ధర వచ్చింది. గత రెండు నెలలుగా యార్డుకు నిత్యం లక్ష నుంచి లక్షన్నర వరకు టిక్కీలు వస్తుండగా వచ్చిన సరుకు వచ్చినట్లుగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఎగుమతి అవకాశాలు లేవని ధర తగ్గిస్తున్నారు. లేదంటే మిర్చికి నాణ్యత లేదనే సాకు చూపుతున్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతుల పరిస్థితిని కేంద్రానికి విన్నవించగా కేంద్ర ప్రభుత్వం కనీస ధరను రూ. 11,781 గా నిర్ణయించింది. క్వింటాళ్ మిర్చి ధర రూ. 11,781 కన్నా తగ్గితే కేంద్రం సాయం చేస్తుందని రెండు నెలల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. మార్కెట్ ఇంటర్ వెన్షన్ ద్వారా రైతులకు సాయంపై ఇంత వరకు ఉత్తర్వులేమీ రాలేదు. ఈ ధర కంటే తక్కువగా కొనుగోలు చేస్తే మిగతా సొమ్మును ప్రభుత్వం రైతులకు ఇస్తుందని ప్రకటించారు. కానీ ఇంత వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కాకపోవడం వల్ల కాలమే సమస్యకు పరిష్కారం చూపుతుందన్న ధోరణిలో ప్రభుత్వ వర్గాలు వేచిచూస్తున్నట్టు రైతులు భావిస్తున్నారు. అయితే రైతులు ఆశించిన ధర కంటే తక్కువ ధరను ప్రభుత్వం నిర్ధారించడం వల్ల వ్యాపారులు ధరలు పెంచడానికి ఆసక్తి కనబడటం లేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి గుంటూరు వచ్చిన మిర్చి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా ఛార్జీల భారంతో పాటు మంచి ధరల కోసం రెండు మూడు రోజులు వేచి ఉండాల్సి వస్తోందని, ధరలు రాకపోవడంతో ఆయన కాడికి అమ్ముకుంటున్నామని రైతులు తెలిపారు. మరోవైపు ఇటీవల అకాల వర్షాలు, ఈదురు గాలులతో యార్డులో మిర్చి తడిసిపోతుండటంతో రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ప్రతిరోజూ ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

# ఇంటర్ పోల్ అధికారి సోనాల్ మెరుపులే మెరుపులు




కొంత గ్యాప్ తర్వాత నాగార్జున 'ది ఘోస్ట్' చిత్రంతో కంబ్యాక్ అవుతోంది సోనాల్ చౌహాన్. ఈ సినిమా విజయంపై సోనాల్ చాలా హోప్స్ పెట్టుకుంది. ప్రస్తుతం కింగ్ తో కలిసి ఘోస్ట్ ప్రచారంలోనూ బిజి బిజీగా ఉంది. నాగార్జున – సోనాల్ చౌహాన్ కాంబినేషన్ లో యాక్షన్ ఎంటర్ టైనర్ ది ఘోస్ట్ అక్టోబర్ 5 న దసరా సందర్భంగా సినిమా హాళ్లలో విడుదలవుతోంది. విడుదల దగ్గర పడుతుండగా టీమ్ ఎంతో ఉత్సాహంగా ప్రచారం చేస్తోంది. తాజాగా తమిళ వెర్షన్ ప్రమోషన్స్ కోసం కింగ్ నాగార్జునతో కలిసి సోనాల్ చెన్నైకి వెళ్లింది. సోనాల్ స్వయంగా ఇన్ స్టాగ్రామ్ లో ఫ్లైట్ నుండి నాగార్జునతో ఉన్న ఫోటోలను షేర్ చేయగా వైరల్ అయ్యాయి. ఈ ఫోటోలకు 'వణక్కం చెన్నై' అని క్యాప్షన్ ఇచ్చారు. రెండ్రోజుల క్రితమే నాగార్జున సోనాల్ చౌహాన్ ద ఘోస్ట్ టీమ్ ఈ సినిమా ట్రైలర్ విడుదలకు చెన్నైకి వెళ్లారు. సోనాల్ లేటెస్ట్ ఫోటోషూట్ అంతే వైరల్ గా మారింది. చెన్నైలో జరిగిన ప్రమోషన్ ఈవెంట్ లో సోనాల్ వెండితో డిజైన్ చేసిన ధగధగల గౌనులో మైండ్బ్లోయింగ్ లుక్ తో అందరినీ ఆశ్చర్యపరిచింది. స్ట్రాప్ లెస్ సిల్వర్ సీక్విన్ డ్రెస్ లో థై స్లిట్ ఎలివేషన్ తో మతులు చెడగొట్టింది. సిల్వర్ లైనింగ్స్ %ా%. అంటూ స్టార్స్ ఈమోజీలను సోనాల్ షేర్ చేసింది. ది ఘోస్ట్ అక్టోబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఘోస్ట్ కథాంశం లీక్....!గ్యాంగ్ స్టర్ల నుండి తన సోదరిని మేనకోడలును రక్షించే లక్ష్యంతో నాగార్జున ఎలాంటి సాహసాలు చేసాడన్నదే సినిమా. ఇందులో ఇంటర్ పోల్ అధికారి విక్రమ్ పాత్రలో అతడు కనిపిస్తాడు. సోనాల్ చౌహాన్ మరొక ఇంటర్ పోల్ ఆఫీసర్గా ఈ సాహసోపేతమైన పనిలో ఘోస్ట్ కి సహాయం చేస్తుంది. ది ఘోస్ట్ బాక్సాఫీస్ వద్ద చిరంజీవి 'గాడ్ ఫాదర్'తో పోటీపడుతున్న సంగతి తెలిసిందే.. ది ఘోస్ట్ మేకర్స్ ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ – తమిళంలో విడుదల చేస్తున్నారు. తెలుగు వెర్షన్ విడుదలైన వారం తర్వాత హిందీ వెర్షన్ ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని గుసగుస వినిపిస్తోంది.

# నాలుగు చేతులా సంపాదిస్తున్న కథానాయిక



పరిశ్రమలో ఆల్ రౌండర్ నైపుణ్యంతో దూసుకుపోవడం కొందరికే సాధ్యం. బాలీవుడ్ లో నటిగా నిర్మాతగా రాణించిన కథానాయికల్లో జూహీ చావ్లా- రవీనా టాండన్- అనుష్క శర్మ పేర్లు ప్రముఖంగా వినిపించేవి. తర్వాత పలువురు కథానాయికలు నిర్మాతలుగా ప్రయత్నించినా విఫలమయ్యారు. కానీ నేటితరంలో సక్సెస్ ని ఆస్వాధిస్తున్న యువనాయికగా ఆలియా భట్ పేరు ఈ జాబితాలో చేరింది. నిర్మాత కమ్ ఎంటర్ప్రెన్యూర్ గా హీరోయిన్ గా ఈ యంగ్ బ్యూటీ బిజీ బిజీ. పరిశ్రమలో అగ్ర కథానాయికగా తన హోదాను కొనసాగిస్తోంది. వరుస బ్లాక్ బస్టర్లతో గోల్డెన్ లెగ్ గా వెలిగిపోతోంది. ఈ ఏడాదిలో నాలుగు బ్లాక్ బస్టర్లలో నటించింది. గంగూబాయి కతియావాడి- డార్లింగ్స్ బ్రహ్మాస్త్రలో భాగమైంది. మరోవైపు సోషల్ మీడియాల ద్వారా ఆర్జనలోను దూసుకుపోతోంది. వ్యాపార రంగంలో కూడా ఆలియా రాణిస్తోంది. తను ఇప్పటికే పిల్లల దుస్తుల వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇప్పుడు ఆమె కొత్త శ్రేణి ప్రసూతి దుస్తుల వ్యాపారాన్ని ప్రారంభించింది. తాజాగా తన మెటర్నల్ వేర్ గురించి సోషల్ మీడియాలో షేర్ చేసింది. మునుముందు కొన్ని నెలల్లో మీరు ఎలా కనిపించబోతున్నారో లేదా ఎలా ఫీల్ అవుతారో మీకు తెలియదు. ధరించడానికి సరైన దుస్తులను కనుగొనలేకపోవడంతో ఒత్తిడికి లోనవుతారు అని వ్యాఖ్యను జోడించింది. అలియా భట్ తనకు పిల్లలు ఇంకా కలగకపోయినా తన కిడ్స్ వేర్ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఇప్పుడు రణబీర్ కపూర్ కి భార్యగా గర్భిణిగా ఉంది. జూన్ 2022 లో తాను మదర్ కాబోతున్న విషయాన్ని ప్రకటించింది. ఈ ఆనంద క్షణంలో ఇలా మెటర్నల్ వేర్ వ్యాపారంలోను సత్తా చాటుతోంది. యువతరంలో ఆలియాకు ఉన్న క్రేజ్ ను క్యాష్ చేసుకునేందుకు బ్రాండ్లు తన వెంట పడుతున్నాయి.

# ఆఫర్లు లేక అందుకు సై అన్న షాలిని.. విజయ్ రికమెండేషనా?



షాలిని పాండే.. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకమైన పరిచయాలు అవసరం లేదు. విజయ్ దేవరకొండ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'అర్జున్ రెడ్డి' మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన షాలిని పాండే.. తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ ను తన ఖాతాలో వేసుకుంది. ఇందులో ప్రీతి పాత్రను అద్భుతంగా పోషించి విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కించుకుంది. తన అమాయకపు చూపులు ఆకట్టుకునే అందం తో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యింది. ఈ మూవీ తర్వాత విజయ్ దేవరకొండ స్టార్ హీరోగా ఎదిగాడు. అయితే షాలిని కెరీర్ మాత్రం అందుకు భిన్నంగా సాగింది. 'అర్జున్ రెడ్డి' వంటి సూపర్ హిట్ అనంతరం షాలిని పాండే తెలుగుతో పాటు మలయాళం తమిళం హిందీ భాషల్లో నటించింది. కానీ ఎక్కడా స్టార్ హోదా ను అందుకోలేకపోయింది. కనీసం ఒక సూపర్ హిట్ ను కూడా ఖాతాలో వేసుకోలేకపోయింది. దీంతో ఈ అమ్మడి కెరీర్ చాలా స్లో అయిపోయింది. ఆఫర్లు కూడా అంతంత మాత్రంగానే వస్తున్నాయి. టాలీవుడ్ లో అయితే షాలిని వైపే ఎవరూ చూడటం లేదు. పైగా కెరీర్ ప్రారంభంలో బొద్దుగా ఉన్న షాలిని పాండే.. ఇటీవల బక్కచిక్కి జీరో సైజు కి మారింది. అయినా సరే ఆమెకు కలిసొచ్చింది ఏమీ లేదు. ఇక ఇలాంటి తరుణంలో షాలిని పాండే గురించి ఓ క్రేజీ న్యూస్ తెరపైకి వచ్చింది. అదేమిటంటే ఆఫర్లు లేక ఈ భామ తాజాగా ఓ ఐటెం సాంగ్ చేసేందుకు సై అన్నదట. ఇంతకీ షాలిని ఏ సినిమాలో స్పెషల్ సాంగ్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందో తెలుసా.. 'ఖుషి'. విజయ్ దేవరకొండ సమంత జంటగా నటిస్తున్న ప్రేమ కథా చిత్రమిది. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ను కంప్లీట్ చేసుకుంటున్న ఈ చిత్రం డిసెంబర్ 23న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతోంది. అయితే ఈ చిత్రంలో ఓ అదిరిపోయే ఐటమ్ సాంగ్ ను ప్లాన్ చేస్తున్నారట. అయితే ఆ సాంగ్ కోసం విజయ్ స్వయంగా షాలిని పాండే ను రికమెండ్ చేశాడట.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# తానొకటి తలిస్తే దైవమొకటి తలచింది



'ఉప్పెన' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రంతో కథానాయికగా తెరంగేట్రం చేసింది కృతి శెట్టి. ఈ కన్నడ భామకు యువతరంలో అసాధారణ ఫాలోయింగ్ ఏర్పడింది. అదే క్రమంలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచిన చందంగా అయ్యింది. ఉప్పెన తర్వాత ఒక్కటంటే ఒక్క హిట్టు లేదు. ఇప్పటికే పలు సినిమాలు చేసినా వరుస ఫ్లాప్ లను చవిచూసింది. నితిన్ తో మాచర్ల నియోజకవర్గం.. రామ్ తో వారియర్ పెద్ద ఫ్లాపులయ్యాయి. ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి కూడా ఫ్లాప్ ల జాబితాలో నిలవడంతో కృతి తీవ్రంగా నిరాశపడింది. అయినా మూడు ఫ్లాప్ లు వచ్చినా కృతికి ఇప్పటికీ డిమాండ్ ఉంది. కానీ ఇటీవల కృతి సినిమాలకు సైన్ చేయడానికి తొందరపడటం లేదని తెలిసింది. వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నప్పటికీ ఏదో ఒకటి సంతకం చేయడానికి తొందరపడటం లేదు. స్క్రిప్ట్ ను జాగ్రత్తగా పరిశీలిస్తోంది. కొన్నిటిని ఇప్పటికే సున్నితంగా తిరస్కరించింది. మంచి స్క్రిప్టు.. నటనకు ఆస్కారం ఉన్న పాత్ర లేకపోతే కథానాయికలు ఎంతగా ప్రయత్నించినా వైఫల్యాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే తన పునరాగమన చిత్రంతో హిట్టు కొట్టి మంచి ప్రభావం చూపేలా చూసుకోవాలని కృతి కోరుకుంటోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com